
సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



శంఖు, చక్ర నామాల ఏర్పాటు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శంఖు, చక్ర, నామాలను పునఃప్రతిష్టించారు.



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం గత 33 రోజులకు గాను రూ.2కోట్ల 42 లక్షల 40,632 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు.



సముద్రం 30 అడుగుల ముందుకొచ్చింది. రంగు కూడా మారింది. తీరం కోతకు గురైంది. వాతావరణ మార్పులు కారణంగా అలల తాకిడి పెరగడంతో సాగరతీరంలో దుకాణాలను మూసివేశారు.

న్యూస్‌రీల్

గణేష్ ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో విధానం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: గణేష్ మండపాలకు అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విధానం అమలు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. గణేష్ ఉత్సవాల అనుమతులను సులభంగా పొందడం కోసం జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, ఫైర్, పొల్యూషన్, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు, గణేష్ మండపం నిర్వాహకులతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు ganeshutsav.net వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పరిశీలించిన తరువాత క్యూర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. పోలీసులు మండపాలను సందర్శించే సమయంలో క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారని తెలిపారు. మండపంలో రాత్రి సమయంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది సభ్యులు ఉండాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని పేర్కొన్నారు. అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని నమ్మవద్దని, అటువంటివి వస్తే వాట్సాప్ నంబర్ 9493336633 ద్వారా పోలీసులకు తెలియజేయాలన్నారు.

19 నుంచి ఆర్బీఐ క్విజ్ పోటీలు



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 90 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కనీసం ఇద్దరు చొప్పున టీంగా ఏర్పడి ఈనెల 17వ తేదీ లోగా https@//www.rbi90quiz.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి క్విజ్ పోటీలు జరుగుతాయని వివరించారు. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలు చొప్పున, జోనల్ స్థాయిలో రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ.3 లక్షల చొప్పున బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

పోర్టులో హిందీ దివస్ వేడుకలు ప్రారంభం



హిందీ దివస్ వేడుకలను ప్రారంభిస్తున్న వీపీఏ డిప్యూటీ చైర్మన్ దూబే

సాక్షి, విశాఖపట్నం : హిందీ దివస్ వేడుకలు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ)లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోర్టు పరిపాలన కార్యాలయ భవనంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్‌దూబే సోమవారం వేడుకలను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో అధికార భాష అమలును పర్యవేక్షించడానికి హిందీ దినోత్సవాన్ని ఏటా 15 రోజుల పాటు నిర్వహిస్తారని దూబే అన్నారు. ఈ సందర్భంగా పోర్టు ఉద్యోగులకు హిందీలో వ్యాస రచన, వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీవీవో స్వామి, పోర్ట్ విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన డీటీవో భవనం



కుర్చీపై పడిన పెచ్చులు

మహారాణిపేట : కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో శిథిలావస్థకు చేరుకున్న భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి కింద పడ్డాయి. దీంతో ఉద్యోగులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పటికే భవనం పాక్షికంగా కూలిపోయింది. ఆ భవనాల నుంచి దశల వారీగా సెక్షన్లు ఖాళీ చేయించారు. వర్షం పడితే డీటీవో కార్యాలయంలోని పలు విభాగాలు కారిపోతున్నాయి. సోమవా రం డీటీవో కార్యాలయంలోని ఎడ్యుకేషన్ బిల్లుల విభాగంలో పెచ్చులూడి కిందపడ్డాయి. దీంతో ఉద్యోగులను అదే కార్యాలయంలో కిందకు పంపారు.

పేదల గుండెచప్పుడు వైఎస్సార్



బీచ్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌కు ఉన్న ప్రజాదరణ దేశంలో ఏ సీఎంకు లేదు
- బీచ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ బొత్స
- హాజరైన మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీలు

సాక్షి, విశాఖపట్నం: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ దేశంలో ఏ సీఎంకు లేదని శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ కొనియాడారు. పార్టీలకతీతంగా తెలుగు ప్రజలంతా మహానేత వైఎస్సార్‌ను ఆరాధిస్తారని పేర్కొన్నారు. సోమవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి నిర్వహణలో బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరదుకల్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో అన్నివర్గాలు మేలు జరిగితే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అంతకంటే ఎక్కువ మేలు జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందించారన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ చేసిన మంచి ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ అంటే పేదల గుండెచప్పుడన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ వైఎస్సార్ దేశ రాజకీయాల్లో ఓ ధ్రువ తార అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, కుంభా రవిబాబు, ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, సమన్వయకర్తలు కేకే రాజు, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యని శ్రీధర్, కట్టమూరి సతీష్, నియోజకవర్గ పరిశీలకులు మొల్లి అప్పారావు, ముఖ్యనేతలు జాన్‌వెస్లీ, వుడా రవి, పిల్లా సుజాత, పేర్ల విజయచందర్, నడింపల్లి కృష్ణంరాజు, జహీర్ అహ్మద్, రవిరాజు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పేడాడ రమణికుమారి, మాధవి వర్మ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ శంకర్‌రావు, కార్పొరేటర్లు కొండబాబు, స్వాతి దాస్, అనిల్ రాజు, మువ్వల లక్ష్మి ,పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, తోట పద్మావతి , చెన్న జానకి రామ్, నాగేశ్వరావు, వరప్రసాద్, రెయ్యి వెంకటరమణ, వాణి నానాజీ, పీవీ సురేష్, మహమ్మద్ ఇమ్రాన్, పీలా వెంకటలక్ష్మి, తుల్లి చంద్రశేఖర్, అల్లంపలి రాజుబాబు, వంకాయల మారుతీ ప్రసాద్, అడ్డాల కృపాజ్యోతి, బోని శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



ఎండాడ లా కాలేజ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి నిర్వహణలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొని మహానేత విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దౌర్జన్యకాండ

- అక్కయ్యపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- నిందితులను కఠినంగా శిక్షించాలని పార్టీ నేత కేకే రాజు డిమాండ్
- నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు



అక్కయ్యపాలెంలో వైఎస్సార్ విగ్రహం (ఫైల్)



పార్టీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: ఆయనంటే ప్రజలకు ప్రాణం.. పార్టీలకతీతంగా అభిమానం. అటువంటి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతమైన విశాఖలో ఇటువంటి విష సంస్కృతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అక్కయ్యపాలెం హైవే పక్కన గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహ ధ్వంసాన్ని మరిచిపోక ముందే 26వ వార్డు అక్కయ్యపాలెంలో మరో విగ్రహ ధ్వంసానికి పాల్పడడంతో ఆవేదన వ్యక్తం చేశారు. మహానేత వర్ధంతి సందర్భంగా నివాళులర్పించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సన్నద్ధమవుతుంటే గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం పార్టీ నేతలు మండిపడుతున్నారు. గతంలో 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌కు ఆనుకొని శివరామ స్వీట్ షాప్ పక్కన ఆ వార్డు యూత్ నాయకులు ఎం. సునీల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పటి నుంచి మహానేత అభిమానులు, అసంఘటిత కార్మికులు వైఎస్సార్ విగ్రహానికి నమస్కరించి పనులకు వెళ్తుంటారు. అంతగా అభిమానించే నాయకుని విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పార్టీ నాయకులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు ఒక పక్కగా ఎవరికీ ఇబ్బంది లేని విధంగా ఉన్న విగ్రహాన్ని కూల్చివేయడం దుశ్చర్యగా పేర్కొన్నారు. కొంతమంది అభద్రతాభావం, రాజకీయ గుర్తింపు కోసమే ఇటువంటి దారుణానికి పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీలకతీతంగా ప్రేమించే, అభిమానించే రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పేడాడ రమణికుమారి, యువజన విభాగం ప్రతినిధి చంద్రశేఖర్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, అనిల్‌కుమార్ రాజు, అల్లు శంకరరావు, సీనియర్ నేత తుల్లి చంద్రశేఖర్, యూత్ నాయకుడు ఎం .సునీల్, సుశీల, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

లేజర్ షో అద్భుతం



బీచ్‌రోడ్డు: విక్టరీ ఎట్ సి మెమోరియల్ స్తూపం పై ఈస్టర్న్ నావల్ కమాండ్ వీరోచిత యుద్ధ విజయాలకు సంబంధించి అద్భుతమైన లేజర్ షోను ఈస్టర్న్ నావల్ కమాండ్, జీవీఎంసీ సంయుక్తంగా సోమవారం రాత్రి నిర్వహించింది. భారత నౌకాదళ చీఫ్ నేవల్ కమాండర్ రాజేష్ పెండార్కర్, కలెక్టర్ ఎం.హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ తూర్పు నౌకాదళ అద్భుత విజయాల పరంపరను లేజర్ షో ద్వారా చూపడం అద్భుతమన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నేవీ అధికారులు పాల్గొన్నారు.



కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

బీచ్‌రోడ్డు: వార్డు సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ ఎరినా చిల్డ్రన్ థియేటర్‌లో నగర పరిధిలో ఎమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో ఇంజినీరింగ్ విభాగం పెద్ద సైన్యమే ఉన్నా ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వెళ్లడం లేదన్నారు. దీంతో సచివాలయ పరిధిలో మౌలిక వసతులపై అవగాహన లేకపోతోందన్నారు. వార్డు సచివాలయ పరిధిలో ఎన్ని వీధి దీపాలు ఉన్నాయి? ఎన్ని వెలుగుతున్నాయి? అలాగే బీటీ, సీసీ రోడ్ల విస్తరణ, గెడ్డలు, కాలువలు, యూజీడీ కనెక్షన్లు, కుళాయి కనెక్షన్లు మొదలైన పూర్తి వివరాలు సంబంధిత శాఖ అధికారులకు తెలియాలన్నారు. రోడ్లు వేసేటప్పుడు ప్రతి ఎమినిటీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని, అందుకే కొత్తగా వేసిన రహదారుల్లో నాణ్యత కొరవడుతోందన్నారు. రాత్రి 6 గంటల నుంచి 9 గంటల వరకు సచివాలయం పరిధిలో ఎన్ని వీధిలైట్లు వెలుగుతున్నాయో ప్రతిరోజు క్షేత్ర స్థాయి పరిశీలించాలన్నారు. మరో మూడునాలుగురోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తానని, అప్పటికీ మీ పరిధిలో అన్ని సమస్యలు తెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉపకార్య నిర్వహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, ఎమినిటి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని రైళ్లు రద్దు



వెలవెలబోతున్న ప్లాట్‌ఫాం



నిలిచిపోయిన రైళ్లు

తాటిచెట్లపాలెం: భారీ వర్షాల కారణంగా మంగళ, బుధవారాల్లో పలు రైళ్ల చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–సికింద్రాబాద్(12739)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–షాలిమర్(12774) ఏసీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విశాఖ–సికింద్రాబాద్(20707/20708) వందే భారత్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విశాఖ–సికింద్రాబాద్(20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి–పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, విశాఖ–మహబూబ్‌నగర్–విశాఖ (12861/62) ఎక్స్‌ప్రెస్, తిరుపతి–విశాఖ (08584)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–షాలిమర్(12842)కోరమండల్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి–విశాఖ(12806)జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విశాఖ(17016)విశాఖ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–గుంటూరు(22701) ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–హైదరాబాద్(12727)గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

4వ తేదీన రద్దయిన రైళ్లు

షాలిమర్–సికింద్రాబాద్(12773)ఏసీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమర్(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ–విశాఖ(20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, ముంబయి–భువనేశ్వర్(11019)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, తాంబరం–సంత్రగచ్చి(22842)అంత్యోదయ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం–హతియా(22838)ధర్తి అబా ఏసీ ఎక్స్‌ప్రెస్, కటక్–హైదరాబాద్(07166) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, • 5న కొచ్చువేలి–షాలిమర్(06081) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 6వ తేదీన హౌరా–మైసూరు(22817) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 7వ తేదీన కన్యాకుమారి–హౌరా(12666)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి–పురూలియా(220606) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

దారి మళ్లించిన రైళ్లు

• 3న విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, రాయగడ, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది. • 3న హైదరాబాద్–షాలిమర్ (18046)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తుంది. • 3న హైదరాబాద్–విశాఖపట్నం(12728) గోదావరి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తుంది.

నేడు విజయవాడకు వన్‌వే స్పెషల్

భారీ వర్షాల కారణంగా ఆయా స్టేషన్‌ల్లో నిలిచిపోయిన ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విజయవాడ వరకు వన్‌వే ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–విజయవాడ(08581) వన్‌వే స్పెషల్ మంగళవారం మధ్యాహ్నం 12.55 గంటలకు బయల్దేరి సాయంత్రం 7.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ సమయాల్లో అదే స్టేషన్‌ల్లో హాల్ట్‌తో నడుస్తుంది.

పండగల వేళ ప్రత్యేక రైళ్లు: వరుస పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్–విశాఖపట్నం, సికింద్రాబాద్–బ్రహ్మపూర్‌ల మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–విశాఖ(07097) స్పెషల్ డిసెంబరు 1వ తేదీ వరకు ప్రతీ ఆదివారాలలో, తిరుగు ప్రయాణంలో విశాఖ–సికింద్రాబాద్ (07098) స్పెషల్ డిసెంబరు 2వ తేదీ వరకు,సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07027) స్పెషల్ నవంబరు 29వ తేదీ వరకు ప్రతీ శుక్రవారాలలో, తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07028) స్పెషల్ నవంబరు 30వ తేదీ వరకు ప్రతీ శనివారాలలో నడుస్తాయి.

వరద బాధితులకు అప్పన్న పులిహోర ప్యాకెట్లు



పులిహోర ప్యాకెట్లు తయారుచేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఈవో

సింహాచలం: విజయవాడ వరద బాధితులకు సింహాలం దేవస్థానం నుంచి పదివేల పులిహోర ప్యాకెట్లను సోమవారం రాత్రి పంపించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు సింహగిరిపై ఉన్న అన్న ప్రసాద భవనంలో పులిహోరని తయారుచేశారు. అలాగే మంగళవారం ఉదయం మరో 10 వేల పులిహోర ప్యాకెట్లు, మధ్యాహ్నం 10 వేల ప్యాకెట్లు పంపించేందుకు సిద్ధం చేస్తున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో సోమవారం రాత్రి అన్న ప్రసాద భవనంలో పులిహోరను తయారుచేస్తున్నారు.

విజయవాడకు నేవీ సహాయక బృందాలు



హెలికాప్టర్‌లోకి ఆహారపదార్థాలు ఎక్కిస్తున్న నేవీ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: జలదిగ్బంధంలో చిక్కుకున్న విజయవాడ నగరంలో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు తూర్పు నౌకాదళ బృందం సోమవారం మధ్యాహ్నం బయల్దేరి వెళ్లింది. రెండు హెలికాప్టర్లు, ఒక డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ తో సహాయక బృందాలు పయనమై.. విజయవాడ చేరుకొని అక్కడ చిక్కుకుపోయిన 22 మంది సిబ్బందిని రక్షించాయి. వరద ముంపులో చిక్కుకున్న బాధితులకు 710 కిలోల ఫుడ్ ప్యాకెట్స్ హెలికాప్టర్ ద్వారా అందించాయి.

పీజీఆర్ఎస్‌కు 84 ఫిర్యాదులు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 84 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు జాయింట్ సీపీ ఫక్కీరప్ప పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లపై పోలీసుల దాడులు

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 92 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌ల్లో పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. మొత్తం 450 సిబ్బందితో 92 బృందాలుగా విడిపోయి ఏకకాలంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో 60 బార్లకు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేనట్లు గుర్తించారు. అలాగే 8 బార్లలో వంటకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌ను వినియోగం, 5 బార్లకు ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్లను నిర్వహించడం, 6 బార్లకు ట్రేడ్ లైసెన్సులు లేకపోవడం, 33 బార్లకు పార్కింగ్ సదుపాయం లేనట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ బార్లపై చర్యలకు సంబంధిత శాఖలకు సిఫార్సులు చేశారు. ఎక్కడైనా, ఏదైనా తప్పు జరిగినట్లు సమాచారం ఉంటే 7995095799 నంబర్‌కు సమాచారం అందించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు.